సాక్షి
జగిత్యాల
శుక్రవారం, 14, ఏప్రిల్, 2023



నేలకొరిగిన పంటలు

ఇబ్రహీంపట్నం: మండలంలో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. సజ్జ, నువ్వుల పంటలు నెలకొరిగాయి. ఆరబోసు కున్న పసుపు తడిసిపోయింది.



ఇక 24గంటల వ్యాపారాలు

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లావ్యాప్తంగా 24 గంటల వ్యాపారాలు నిర్వహించేందుకు వ్యాపారులు సన్నాహాలు చేస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.0/26.0

పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఎండ తీవ్రత కొనసాగుతుంది. సాయంత్రం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

రంజాన్ వేళలు

మానవులందరూ ఒక్కటే. కలిసి మెలసి జీవించండి. పరస్పరం శత్రువులుగా మారకండి.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్ శుక్ర 6:35 | సహర్ శని 4:33

న్యూస్‌రీల్

నువ్వు పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



నువ్వు పంటలో పొలాస శాస్త్రవేత్తల బృందం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సాగు చేసిన నువ్వు పంటను పొలాస శాస్త్రవేత్తల బృందం సభ్యులు డాక్టర్ పద్మజ, డాక్టర్ బలరాం గురువారం సందర్శించారు. రైతులకు పలు సూచనలు అందించారు. జిల్లాలోని జోగినపల్లి, పోరుమల్ల, చల్‌గల్, వెల్దుర్తి గ్రామాల్లో పొలాస పరిశోధన స్థానం నుంచి నువ్వుల విత్తనం తీసుకెళ్లి, సాగు చేసిన రైతుల పొలాలను సందర్శించారు. నువ్వు పంటకు అక్కడక్కడ బూడిద తెగులు, కాండంకుళ్లు తెగులు, బిహారీ గొంగలి పురుగు ఆశించినట్లు తెలిపారు. వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోడు భూములపై హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): ప్రభుత్వం ఆదివాసీలకు పోడు భూములపై హక్కులు కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాథ్‌పూర్‌లో గురువారం జరిగిన కొమురం భీం విగ్రహావిష్కరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఆదివాసుల హక్కుల కోసం ఆంగ్లేయులను తరిమికొట్టిన కొమురం భీంను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపిరాజురెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు రవీందర్‌రావు, నాయకులు మహేందర్‌గౌడ్, రమేష్, కవిత, మారుతి ఉన్నారు. అనంతరం రాయికల్‌లోని షాదీఖానాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. మైనార్టీ నాయకులు నబీ, మున్ను, షాకీర్, షంశీర్,మసూద్,రసూల్, పట్టణాధ్యక్షులు మ్యాకల రమేశ్, దివాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, గోపిరాజరెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలకు కోచ్‌ల నియామకం

జగిత్యాలటౌన్: జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు అర్హత ఉన్న కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని 10కేంద్రాల్లో మే 1 నుంచి 31 వరకు వివిధ క్రీడాంశాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక కోచ్‌లు తమ పూర్తి వివరాలతో ఏప్రిల్ 24 సోమవారం సాయంత్రం 4గంటలలోపు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేయాల్సిందిగా కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు అర్హులని పేర్కొన్నారు.

మహిళా సంఘంలో సభ్యత్వం తీసుకోవాలి

జగిత్యాలరూరల్: ప్రతీ సభ్యురాలి పూర్తి వివరాలను జాతీయ జీవనోపాధి మిషన్‌లో నమోదు చేయాలని జిల్లా సెర్ప్ అదనపు ప్రాజెక్టు సంచాలకుడు శ్రీకర్ సుదీప్ అన్నారు. గురువారం జగిత్యాలలోని ఐకేపీ కార్యాలయంలో జాతీయ జీవనోపాధుల మిషన్‌కు సంబంధించిన లోకోస్ యాప్‌లో సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. అన్ని రాష్ట్రాలకు సంబంధించిన మహిళా సంఘాల వివరాలు ఒకే యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైందని, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మహిళా సంఘాలు, సభ్యులు, గ్రామ సమాఖ్యలు, మండల సమాఖ్యల వివరాలను నమోదు చేస్తామన్నారు. సభ్యుల ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ ఖాతా, బీమా, చిరునామా, సభ్యురాలి ఫోటోతో అప్‌లోడ్ చేయాలన్నారు. స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ ఆనందరావు, ఏపీఎం గంగాధర్, డీఎంజీలు, శిక్షకులు కె.దేవయ్య, ఎం.దాస్ ఎస్.సంతోశ్, సీసీలు రవీందర్, విద్యాసాగర్, గంగారాం, పద్మ, సురేందర్‌జీలు, రమ, మమత, మాధవి, అశోక్ పాల్గొన్నారు.

అయ్యో.. గౌడన్న!

'గాల్లో దీపం'లా గీత కార్మికుల ప్రాణాలు

- తాటిచెట్లు ఎక్కుతూ ప్రమాదాలకు గురవుతున్న వైనం
- ఆదుకోని ప్రభుత్వం.. సకాలంలో అందని పరిహారం
- జిల్లాలో రెండేళ్లలో రావాల్సిన మొత్తం రూ.1.12కోట్లు
- యంత్రాలు అందుబాటులోకి తేవాలంటున్న యువత



'జగిత్యాలలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ గీతకార్మికుడి పేరు బుర్ర రాజయ్య. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామం. ఇతడికి గ్రామంలో 3 తాటి చెట్లు కేటాయించగా, వాటి నుంచి కల్లు తీసి కొన్నేళ్లుగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత మంగళవారం తాటిచెట్టుపై నుంచి పడడంతో పక్కటెముకలు దెబ్బతిన్నాయి. చేయి విరిగింది. ప్రస్తుతం ఈయన కుటుంబానికి పోషణ కష్టంగా మారింది.' ఇలా ఒక్క గీతకార్మికుడే కాదు. జిల్లాలోని చాలా మంది గీతకార్మికులు తాటిచెట్లు ఎక్కుతూ తీవ్రగాయాలపాలవుతూ, జీవచ్ఛంలా మంచానికే పరిమితమవుతున్నారు. కొందరైతే ప్రాణాలు కోల్పోతున్నారు. వీరికి ప్రభుత్వ ఇచ్చే సాయం ఏ మూలకూ సరిపోవడం లేదు.



తాటిచెట్టు పైనుంచి పడి మరణించిన గీతకార్మికుడు(ఫైల్)

జిల్లాలో గీతకార్మికులు	16,492
2022–23లో గాయపడినవారు	103
మరణించినవారు	08
శాశ్వత అంగవైకల్యం	03
2021–22లో మరణించినవారు	06
శాశ్వత అంగవైకల్యం	09
మరణిస్తే ఇచ్చే పరిహారం	రూ.5లక్షలు
శాశ్వత అంగవైకల్యం పొందితే	రూ.5లక్షలు
రెండేళ్లలో రావాల్సిన మొత్తం	రూ.1.12కోట్లు

కులవృత్తే వారి జీవనాధారం. ప్రకృతి ఇచ్చే కల్లే వారికి బతుకుదెరువు. పొద్దంతా కష్టపడితే రూ.500 కూడా రాని పరిస్థితి. నిత్యం రెండుపూటలు ఎత్తయిన తాటి చెట్లు ఎక్కుతూ, కాళ్లు, చేతులు కాయలుకాసినా కుటుంబపోషణకు కష్టపడుతున్న గౌడ కులస్తుల బతుకులు గాల్లో దీపంలా తయారయ్యాయి. ఓ వైపు ఊరూరా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టుషాపులు కులవృత్తిని దెబ్బతీస్తుండగా.. కల్లుగీయడానికి చెట్టు ఎక్కుతున్న గౌడ కార్మికులు మోకు జారి ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు నిత్యం పెరిగిపోతున్నాయి. చెట్టు పైనుంచి పడడంతో చాలా మంది మంచానికే పరిమితం అవుతుండగా.. మరికొందరు ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబం రోడ్డున పడుతోంది. సర్కారు ఇచ్చే పరిహారం అంతంతే కాగా.. అదికూడా సమయానికి చేతికిరాని దుస్థితి జిల్లాలోని గౌదన్నలది.

– జగిత్యాల అగ్రికల్చర్/సారంగాపూర్(జగిత్యాల)



అక్కడక్కడ కనిపిస్తున్న యంత్రాలు

కల్లుగీతే జీవనాధారం

- జిల్లావ్యాప్తంగా 16,492 మంది గీతకార్మికులుగా కులవృత్తిలో కొనసాగుతున్నట్లు ఎక్సైజ్ శాఖ రికార్డులు చెబుతున్నాయి.
- వీరేకాకుండా సభ్యత్వం లేనివారు చాలా మంది కార్మికులు, యువ కార్మికులు ఉన్నారు. వీరు ప్రతిరోజు రెండు పూటలు ఈత, తాటివనాల్లో కల్లుగీసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.
- ప్రస్తుతం గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఏర్పాటు కావడం, కల్లుగీసేందుకు యువత ముందుకు రాకపోవడంతో నాటితరం నుంచి వృత్తిలో కొనసాగుతున్నవారే ఇప్పటికీ ఎత్తయిన చెట్లు మోకుసాయంతో ఎక్కుతున్నారు.
- జిల్లాలో గీతకార్మికులను వరుస ప్రమాదాలు భయపెడుతున్నాయి. 2022– 23 ఏడాదిలో 103 మంది కార్మికులు చెట్టు పైనుంచి పడి ప్రమాదాల బారిన పడ్డారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.
- ఒక్కో తాటిచెట్టు కనీసం 40–50 మీటర్ల ఎత్తు ఉంటుంది. చెట్టు ఎక్కి, కల్లు గీసి, కిందకు తీసుకురావడం ఇబ్బందికరమైన పనే. ఎక్కేటప్పుడు, దిగే సందర్భంలో మోకు జారిపోవడంతో పాటు పలు కారణాలతో ఎత్తయిన తాటి చెట్టు నుంచి కింద పడిపోతున్నారు.
- దీనికి తోడు షుగర్, బీపీ లాంటి అనారోగ్య సమస్యలు ఉన్నవారు చెట్టుపైకి ఎక్కిన తర్వాత కళ్లుతిరిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇందులో చాలా మంది గాయాలపాలవుతుండగా.. మరికొందరు మరణిస్తున్నారు.



తాటిచెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు

అందని పరిహారం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాటిచెట్టు పైనుంచి పడి మరణిస్తే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నారు. తీవ్ర గాయాలతో శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ.5లక్షలు ఇస్తున్నారు. గాయాలపాలైతే రూ.10వేలు ఇస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఎటూ సరిపోవడం లేదని గౌడసంఘం నాయకులు చెబుతున్నారు. చెట్టునుంచి పడితే ఆస్పత్రిలో పెట్టే ఖర్చులకోసం అప్పులు చేయాల్సి వస్తోందని పరిహారం రూ.25లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా జిల్లావ్యాప్తంగా ప్రమాదాల బారిన పడి మరణించిన, గాయాలపాలైన గౌడకార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం రెండేళ్లుగా అందడం లేదని, రూ.1.12కోట్లు రావాల్సి ఉందని చెబుతున్నారు. తాటి, ఈత చెట్లు ఎక్కేందుకు ప్రభుత్వం తమకు యంత్రాలు సమకూర్చాలని యువత కోరుతోంది.



కాలు విరిగింది

నేను ఇటీవల చెట్టుపై నుంచి పడ్డాను. కాలు విరిగిపోయింది. ప్రస్తుతం చెట్టు ఎక్కే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఒక్కరికి ఇచ్చే పరిహారంతో వందమంది కార్మికులకు యంత్రాలు సమకూర్చవచ్చు. ఈ దిశగా చర్యలు తీసుకుంటే ప్రమాదాలు జరగవు. మా అన్న రవీందర్, నేను ఇద్దరం చెట్టుపైనుంచి పడి ఇంటికే పరిమితం అయ్యాం.

– తిరుమల శ్రీనివాస్, పోచంపేట, సారంగాపూర్

రూ.25 లక్షలకు పెంచాలి



గీతకార్మికులు కల్లు విక్రయంతోనే ఉపాధి పొందుతున్నారు. తాటిచెట్టుపై నుంచి పడి కల్లుగీయ లేని పరిస్థితుల్లో ఉన్న వారికి, ప్రమాదంలో మరణించిన వారికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి. అదికూడా తీవ్రగాయాలైన, చనిపోయిన కుటుంబాలకు వారం రోజుల్లోపే అందజేయాలి.

– గర్వంద రాములు, గీతకార్మికుడు

పరిహారం ఇస్తున్నం



ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రమాదవశాత్తు మృతిచెందిన గీతకార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నాం. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో పరిహారం పెంచాలని కోరుతున్నారు. గాయాలైనవారికి సైతం ఎక్కువ మొత్తంలో పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రీధర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, జగిత్యాల

ఎడతెగని వివాదం

- స్థలం ఇవ్వాలంటున్న పేదలు
- నిబంధనలకు విరుద్ధమంటున్న అధికారులు
- అడ్డుకుంటున్న పోలీసులు..
- మూడ్రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు



పేదలు హద్దులు పెట్టుకుంటున్న స్థలాలు



పోలీసుల పహారా

కోరుట్ల: నిరుపేదలకు ఇండస్థలాలు ఇప్పించాలన్న లక్ష్యంతో ముందుకు కదలిన సీపీఎం ఉద్యమం వివాదాస్పదంగా మారింది. మూడు రోజులుగా వందలాదిగా నిరుపేదలు తరలివచ్చి జంబిగద్దె స్థలంలో హద్దులు పాతడం.. చీరలతో డేరాలు వేయడం వాటిని రెవెన్యూ, పోలీసు సిబ్బంది తొలగించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. చివరికి పోలీసుల యంత్రాంగం జంబి గద్దె సమీపంలో ప్రభుత్వ స్థలం వద్దకు ఎవరూ వెళ్లకుండా పెద్ద ఎత్తున పహారా పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏమిటీ వివాదం

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలన్న లక్ష్యంతో వారంరోజుల క్రితం సీపీఎం నాయకులు తిరుపతి నాయక్ అధ్వర్యంలో పేదలకు సమాచారం ఇచ్చాడు. కోరుట్ల పట్టణంలోని జంబి గద్దె వద్ద 922, 923 సర్వే నంబర్లలో సుమారు 45 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నట్లుగా గుర్తించారు. ఆ స్థలం నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించడానికి పనికొస్తుందన్న యోచనలో అక్కడ నిరుపేదలు స్థలాలకు హద్దులు పెట్టుకుని డేరాలు వేసుకోవాలని పార్టీ పరంగా సూచించాడు. మూడు రోజుల నుంచి కోరుట్ల, మండలం, పరిసర గ్రామాలకు చెందిన నిరుపేదలు వందలాదిగా తరలివచ్చి జంబి గద్దెల సమీపంలో ఉన్న హద్దులు పాతుకుని చీరలతో డేరాలు వేసుకోవడం మొదలెట్టారు. ప్రభుత్వ స్థలంలో హద్దురాళ్లు వేసుకోవడం డేరాలు వేస్తున్న సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ఎలాంటి ఆక్రమణలు కుదరదని అడ్డుచెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీడని ఉద్రిక్తత

రెవెన్యూ అధికారుల ఫిర్యాదులతో కదిలిన పోలీసులు నిరుపేదలకు జంబి గద్దెల సమీపంలో స్థలాల్లో హద్దులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పిన సీపీఎం నాయకులపై కేసు నమోదు చేశారు. రెండు రోజులుగా జంబి గద్దెల స్థలం సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసుల అధ్వర్యంలో పెద్ద ఎత్తున పహారా పెట్టారు. అయినప్పటికీ చాలా మంది నిరుపేదలు తమకు ఇండ్ల స్థలాలు కావాలని కోరుతూ జంబి గద్దెల స్థలం వద్దకు వెళ్లిన హద్దులు గీసుకుని డేరాలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో జంబి గద్దెల సమీప స్థలంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని ప్రచారం జరగడంతో పెద్ద ఎత్తున జనం అక్కడికి వెళ్లి హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించడం ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వ స్థలాల్లో హద్దులు పాతడం, డేరాలు వేయడం చట్టవ్యతిరేకమని తహసీల్దార్ రాజేశ్ తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం పేదలను గుర్తించి ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకుంటేనే ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం ఉంటుందని తప్పుడు ప్రచారంతో అనవసరంగా ఇబ్బందులు పాలు కావద్దని ఆయన సూచించారు. నిరుపేదల తరఫున ఉద్యమానికి శ్రీకారం చుట్టిన సీపీఎం నాయకులు తిరుపతి నాయక్ మాట్లాడుతూ, నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- కేంద్రం రాయితీ ఇవ్వకపోవడంతోనే పెట్రోల్ బంకుల మూసివేత
- న్యాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

రాయికల్(జగిత్యాల): సహకార సంఘాల బలోపేతానికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని న్యాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. మండలంలోని భూపతిపూర్, ఇటిక్యాల, ఆలూరు, అల్లీపూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గోదాంలను ప్రారంభించారు. రాయికల్ పట్టణంలో రూ.64 లక్షలతో నిర్మించే కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్‌కు ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌లతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల ఆదర్శంగా నిలిచాయన్నారు. రైతుల పిల్లలు విదేశాల్లో చదివేందుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.102 కోట్ల రుణాలు అందించిన ఘనత సహకార సంఘాలకు దక్కుతుందన్నారు. కేంద్రం రాయితీలు నిలిపివేయడంతో పెట్రోల్ బంకులు మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న 4వేల మందిని క్రమబద్ధీకరణ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో పార్టీలకు అతీతంగా అన్ని సొసైటీలకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. జెడ్పీ చైరపర్సన్ ద్యావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ లౌడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సింగిల్‌విండో చైర్మన్లు ఏనుగు మల్లారెడ్డి, దీటీ రాజరెడ్డి, మహిపతిరెడ్డి, ముత్యంరెడ్డి, రాజలింగం, కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, సహకార సంఘం ముఖ్య కార్యదర్శి సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ఇథనాల్ ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

జగిత్యాలటౌన్: ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటుపై ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారం మానుకోవాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. జగిత్యాల ధరూర్‌క్యాంపులోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో మాట్లాడుతూ.. దేశంలోనే సహకార దిగ్గజాలైన క్రిభ్‌కో, ఇఫ్‌కో ఆధ్వర్యంలో రైతులకు మేలుచేసేందుకే ప్రభుత్వం ఇథనాల్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోందన్నారు. వెల్గటూర్ మండలంలో ఏర్పాటు చేసే ఇథనాల్ ప్రాజెక్టుతో పర్యావరణానికి ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో స్థానికులకు ఉద్యోగావకాశాలు వస్తాయన్న విషయాన్ని గ్రహించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, కేడీసీసీ మెంబర్ రాంచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం

- జిల్లాలోని సర్పంచుల ఆవేదన



సమస్యల చిట్టా చూపుతున్న సర్పంచులు

జగిత్యాలటౌన్: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల బిల్లులు రావడంలేదని, ఎనిమిది నెలలుగా ప్రభుత్వం ఫ్రీజింగ్ విధించడంతో ట్రెజరీలో చెక్కులు పాస్‌కాక, అప్పులపాలై, రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించిందని జిల్లాకు చెందిన పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. ఆరునెలలుగా స్టేట్‌ఫైనాన్స్ కమిషన్(ఎస్‌ఎఫ్‌సీ) నిధులు నిలిపివేశారని అన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులు కూడా విడుదల కావడం లేదన్నారు. పీఎంఎఫ్‌సీ పేరుతో కొత్త ఖాతాలు తెరిచిన అధికారులు, కేంద్రం నిధులు నేరుగా జమ అవుతాయని చెప్పి ఏడాది గడుస్తుండగా కేవలం ఒక్కనెల మాత్రమే నిధులు జమ అయ్యాయని సర్పంచ్‌లు వివరించారు. ఏడాది కాలంగా ఉపాధిహామీ నిధులు కూడా విడుదల కావడం లేదని, గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ డీజిల్‌తో పాటు ట్రాక్టర్ కిస్తీలు చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకోసం అప్పులు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అవి తీర్చలేక రోడ్డున పడే పరిస్థితి ఎదురైందనిఅన్నారు. ప్రజాసేవకోసం రాజకీయాల్లోకి వస్తే సర్పంచ్ పదవి ప్రాణాల మీదకు వస్తోందని వివరించారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో గొల్లపల్లి సర్పంచ్ ముస్కు నిశాంత్‌రెడ్డి, బీబీరాజ్‌పల్లి సర్పంచ్ రేవెల్ల సత్యనారాయణగౌడ్, అబ్బాపూర్ సర్పంచ్ పురంశెట్టి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామాల్లో విద్యుత్ పనులు పూర్తిచేయాలి



స్తంభాల వద్ద పనులు చేస్తున్న సిబ్బంది

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలంలోని దత్తత గ్రామాలు ముత్యంపేట, తక్కళ్లపల్లిలో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. ఏఈ కొమ్ము కమలేశ్వర్ దత్తత గ్రామాలైన ముత్యంపేట, తక్కళ్లపల్లి గ్రామాల్లో పనులను ఎస్‌ఈ ఫోన్ ఇన్ ద్వారా పర్యవేక్షించారు. ఏఈ కమలేశ్వర్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లో మీటర్లకు సీలింగ్, చెట్ల కొమ్మల తొలగింపు, విరిగిన స్తంభాలను తొలగించి, నూతనంగా స్తంభాలు వేశామని, సపోర్టు స్టేలు, స్టడ్‌పోల్స్ వేశామని వివరించారు.

రాజ్యాంగం గురించి అవగాహన ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: భారత రాజ్యాంగం గురించి ప్రతీఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. దేశంలోని ప్రతీపౌరుడు ఎలా ఉండాలో రాజ్యాంగం నేర్పుతుందని చెప్పారు. అంబేడ్కర్ వంటి మహనీయులు 2 ఏళ్ల 11 నెలల 18 రోజులు రాజ్యాంగానికి రూపకల్పన చేశారని అన్నారు. ఆనాటి మహనీయులు రాసిన రాజ్యాంగాన్ని నేటికీ మనం పాటిస్తున్నానమని చెప్పారు. మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ప్రసాద్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి నీహారిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్ పాల్గొన్నారు.

కోర్టులో మహిళా న్యాయవాదులకు ప్రత్యేక వసతి

జగిత్యాల కోర్టులో మహిళా న్యాయవాదులకు ప్రత్యేక వసతి కోసం గదిని కేటాయించారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ గదిని ప్రారంభించారు. మహిళా న్యాయవాదులు చట్టాల గురించి విస్తృతంగా తెలుసుకుని, కేసుల్లో వాదన పటిమను పెంచుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఇసుక లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

మల్లాపూర్ : మండలంలోని వీవీరావుపేట శివారులో బుధవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. మండలంలోని పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇసుక లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. గోదావరి నది పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రామ్‌లు మృతి తీరని లోటు

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు మృతికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఎమ్మెల్యేగా మెట్‌పల్లి ప్రాంత అభివృద్ధికి రామ్‌లు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి పేద వర్గాలకు తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇక 24 గంటలు వ్యాపారాలు

- మున్సిపాలిటీల్లో అవకాశం
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- వ్యాపారులకు వెసులు బాటు



జిల్లా కేంద్రంలోని దుకాణ సముదాయాలు

జగిత్యాల: మున్సిపాలిటీల్లో ఇకనుంచి వ్యాపారులు 24 గంటలపాటు తమ వ్యాపారాన్ని నిర్వహించే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇంతకుముందు రాత్రి 10 గంటల వరకే దుకాణాలు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలు మూసివేయాలన్న నిబంధన ఉండేది. కాగా 24 గంటలు తమవ్యాపారం చేసుకోవచ్చని ప్రభుత్వం జీవోజారీచేసింది. దీంతో వ్యాపారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం కొన్ని నిబంధనలు సైతం విధించింది. వ్యాపారులు వ్యాపారం చేసుకోవాలంటే కార్మికశాఖకు రూ.10 వేలు వార్షిక రుసుం చెల్లించాలని నిబంధనల్లో పేర్కొంది. దుకాణాల్లో పనిచేసే సిబ్బందికి ఎక్కువ సమయం పనిచేసినందుకు అదనపు భత్యం చెల్లించడం, పండుగలు, ఇతరత్రా సెలవులు ఇవ్వడంతో పాటు, వారికి గుర్తింపుకార్డులు అందజేయాలని పేర్కొంది..

మహిళలకు ప్రత్యేక భద్రత..

రాత్రి వేళల్లో దుకాణాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు భద్రతా చర్యలు కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఎక్కువగా సారీ సెంటర్లు, లేడీస్ ఎంపోరియాల్లో పనిచేసేందుకు చుట్టుపక్క గ్రామాల నుంచి వస్తుంటారు. వీరు రాత్రి పూట విధులు నిర్వహిస్తే వారికి భద్రతతో పాటు, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.

వ్యాపారులకు వెసులుబాటు

జిల్లాలో వ్యాపారాలు చేసుకునే వారికి పండగ వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాత్రి కాగానే దుకాణాలు మూసివేయాలని ఆంక్షలు ఉండేవి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్లలో దుస్తుల వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల సమయాల్లో దుకాణాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. మహిళలు దుస్తుల కొనుగోళ్ల సమయంలో ఎక్కువ సమయం తీసుకుంటారు. ఇకముందు రాత్రి పూట ఇబ్బందులు తప్పనున్నాయి.

అనుమతులు తీసుకోవాలి



వాణిజ్య వ్యాపారులు 24 గంటల పాటు దుకాణాలు తెరుచుకోచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో కార్మిక శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. అందులో కార్మికుల వేతనాలు, సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర వివరాలు పొందుపర్చాలి. రూ.10వేలు చెల్లించి ప్రత్యేక అనుమతి తీసుకోవాలి.

– రాజేశ్వరమ్మ, సహాయ కమిషనర్, కార్మికశాఖ

కాంగ్రెస్ నాయకులు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

- పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ధర్మపురి : మంచిర్యాల జిల్లాలో నేడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే సత్యాగ్రహ దీక్ష సభ, భట్టి విక్రమార్క పాదయాత్రకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ధర్మపురిలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ అవినీతి పాలనపై ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దును తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి జిల్లాలో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సత్యాగ్రహ దీక్ష అదే విధంగా మరుసటి రోజు ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండలంలో భట్టి విక్రమార్క పాదయాత్ర మొదలౌతుందని తెలిపారు. జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షకు లక్షమందిని తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారని, అందుకు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేములు రాజేశ్, కుంట సుధాకర్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్, అప్పం తిరుపతి, అశెట్టి శ్రీనివాస్, స్తంభంకాడి గణేశ్ తదితరులున్నారు.

హామీలను నెరవేర్చాలి

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సత్యం



గోదావరి వద్ద చెత్తను తొలగిస్తున్న నాయకులు

ధర్మపురి : సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ధర్మపురిలోని గోదావరి తీరం పుష్కరఘాట్ల వద్ద గురువారం పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. మురుగునీటితో గోదావరి కలుషితమవుతుందన్నారు. ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా కనీస వసతులు లేవని ఆరోపించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా సీఎం కేసీఆర్ ఆలయానికి, గోదావరి నది ప్రక్షాళనకు రూ. 500 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదని, ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు లవన్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్, నలుమాసు వైకుంఠం, దొనకొండ నరేశ్, బండారి గణేశ్, నరెడ్ల శంకర్, తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న వినీల్‌కుమార్

మెట్‌పల్లి : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్ అన్నారు. కోర్టు ఆవరణలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే ప్రతి ఒక్కరికీ స్వీయ రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. న్యాయవిజ్ఞాన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు రాజ్ మహమ్మద్, మగ్గిడి వెంకటనర్సయ్య, వడ్డెపల్లి శ్రీనివాస్, తదితరులున్నారు.

రాజిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తుల ఉమ

రాయికల్ : మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు దుంపల రాజిరెడ్డి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను గురువారం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ పరామర్శించారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇక్కడ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, నాయకులు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ రాజనాల మధుకుమార్, తదితరులు పాల్గొన్నారు.


సైబర్ నేరగాళ్ల కుచ్చుటోపీ

ధర్మపురి : సైబర్ నేరాలకు ధర్మపురికి చెందిన వ్యక్తి ఈనెల 14న మోసపోయాడు. క్రెడిట్ కార్డు పునరుద్ధరణ కోసం ఓటీపీ చెప్పగానే ఖాతాలో ఉన్న 1.93 లక్షలు మాయమయ్యాయి. బాధితుడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మరో వ్యక్తి వేముల ప్రశాంత్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్, టెలిగ్రాం యాప్‌లకు పార్ట్‌టైం జాబ్ చేస్తే డబ్బులు వస్తాయని బుధవారం మోసపూరిత ప్రకటనతో ప్రశాంత్ రూ. 6,64,000లను పోగొట్టుకున్నాడు. వెంటనే మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ కోటేశ్వర్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో మోసపోయి డబ్బులు పోగోట్టుకున్నట్లయితే 1930కి ఫోన్ చేయాలని తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



చిన్నరాజం (ఫైల్)

కోరుట్ల రూరల్ : మండలంలోని మోహన్‌రావుపేటకు చెందిన కల్లెడ చిన్నరాజం (45) గురువారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నరాజం వారంక్రితం కోరుట్ల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

17 నుంచి ఉచిత శిక్షణ

జగిత్యాల టౌన్ : ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యునికేషన్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏబీవీపీ నగర శాఖ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ తెలిపారు. ఈనెల 17నుంచి మే 15వ తేదీవరకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బృందంతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 13 నుంచి 16వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 70136 61554, 7288906497, 9100718678 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఈత కోసం కాలువలో దిగి బాలుడి మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): ఈత కోసం సాగునీటి కాలువలో దిగి, నీట మునిగి బాలుడు మృతిచెందిన సంఘటన గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో జరిగింది. కొత్తపల్లికి చెందిన మేడ నిఖిల్(10) గురువారం సాయంత్రం తన బంధువుతో కలిసి పొలం దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఆడుకొని పక్కనే ఉన్న ఎగువమానేరు ప్రాజెక్టు కుడి కాలువలో ఈత కొట్టడానికి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందాడు. కాలువ గట్టుపై బట్టలు కనిపించడంతో భయాందోళనకు గురైన కుటుంబసభ్యులు, బంధువులు కాలువలో గాలించగా.. బాలుడి మృతదేహం లభించింది. బాలుడి మృతి గ్రామంలో విషాదం నింపింది. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. నిఖిల్ స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. తండ్రి నవీన్ ఇటీవల దుబాయి వెళ్లాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు.

అంబేడ్కర్ చౌక్‌కు కొత్త శోభ



అంబేడ్కర్ విగ్రహానికి రంగులు వేస్తున్న పెయింటర్

జగిత్యాల టౌన్ : నేడు అంబేడ్కర్ జయంతి సందర్భంగా జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి కొత్త రంగులద్దారు. విగ్రహం చుట్టూ ఉన్న కేబుళ్లు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ లైట్లను తొలగించిన బల్దియా సిబ్బంది విగ్రహానికి కొత్త రంగులు వేశారు. దీంతో తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహంతో పాటు చౌరస్తా కొత్త శోభను సంతరించుకుంది.

దివ్యాంగులకు ఉపకరణాలు

జగిత్యాల: దివ్యాంగులకు ఉచితంగా ఆధునీకరించిన ఉపకరణాలు అందిస్తున్నామని, అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్‌భాషా ఒక ప్రకటనలో కోరారు. శారీరక వైకల్యం కలిగి ఉండి ఉన్నత విద్యనభ్యసిస్తున్న, నిరుద్యోగులైన దివ్యాంగులకు రూ.1.15 లక్షల విలువ చేసే 15 రిట్రోఫిటెడ్ త్రిచక్రవాహనాలు, కండరాల బలహీనత, వెన్నముక దెబ్బతిన్నవారికి 11 బ్యాటరీ ఆధారిత వీల్‌చైర్, ఉన్నత విద్యనభ్యసించే దివ్యాంగులు, పీహెచ్‌డీ చదువుతున్న శారీరక వైకల్యం కలిగి ఉన్న దివ్యాంగులకు 7 ల్యాప్‌టాప్‌లు, 1డైసీ, ఎంపీ 3 ప్లేయర్లు, ఉన్నత విద్యనభ్యసించే వారికి స్మార్ట్‌ఫోన్లు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్ ట్యాంకర్

సారంగాపూర్ : మండలంలోని బట్టపల్లి గ్రామ శివారులో గురువారం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తాపడింది. వివరాల్లోకి వెళితే.. గ్రామ శివారులోని డొల్లుగుండు ప్రాంతంలో హరితహారం మొక్కలకు నీరందించేందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్‌ను డ్రైవర్ తిరుపల్లి నర్సయ్య తీసుకెళ్లాడు. కాలువ వెంట వెళ్తుండగా ఒక్కసారిగా బోల్తాపడింది. కాగా నర్సయ్య ట్రాక్టర్ మధ్యలోనే ఇరుక్కుపోయాడు. సర్పంచ్ అర్రె లక్ష్మీ, గ్రామస్తులు అక్కడికి చేరుకుని జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తొలగించి డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాన్స్‌కో అధికారుల తీరుపై ఆగ్రహం

కథలాపూర్ (వేములవాడ): ట్రాన్స్‌కో అధికారుల తీరుపై మండల బీజేపీ నాయకులు గురువారం ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 'సిస్టమ్ స్ట్రెంతనింగ్' పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని, పనుల ప్రారంభోత్సవానికి ప్రోటోకాల్ ప్రకారం ఎంపీ బండి సంజయ్‌కు సమాచారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. కేవలం ఎమ్మెల్యేను ఆహ్వానించి పనులు ప్రారంభిస్తారా అంటూ అధికారులపై బీజేపీ సీనియర్ నాయకులు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, తెడ్డు మహేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, డీఈ తిరుపతి బీజేపీ నాయకులను సముదాయించారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా చూస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లాలో ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తూ నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ ఎల్ రమణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో రూ. 4 కోట్లతో గర్ల్స్ హైస్కూల్, ఓల్డ్ హైస్కూల్ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో 16 పాఠశాలలకు రూ.10 కోట్లు, నర్సింగ్ కళాశాలకు రూ.20 కోట్లు, పొలాస వ్యవసాయ కళాశాలకు రూ. 20 కోట్లు, మెడికల్ కళాశాల ఏర్పాటు తదితర పనులతో పాటు, జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోళి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కొండగట్టు (చొప్పదండి): కొడిమ్యాల మండలం.. నాచుపెల్లి జెఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోసీఎం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు. అనంతరం విద్యార్థుల చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. రెండ్రోజులపాటు నిర్వహిస్తున్న వేడుకలు ముగిశాయని ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ సురేశ్ కుమార్, స్టూడెంట్ కోఆర్డినేటర్ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గీత కార్మికుడి మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఓ గీతకార్మికుడు వృత్తిరీత్యా ఈతచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా గుండెపోటుకు గురై చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన మండలంలోని దుమాలలో తీవ్ర విషాదం నింపింది. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన గీత కార్మికుడు కదిరె ఎల్లయ్య(49) కుల వృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం యథావిధిగా కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు నుంచి కల్లు తీస్తున్న క్రమంలో కిందపడిపోయాడు. గమనించిన తోటికార్మికులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలుడికి ప్రాణభిక్ష పెట్టండి

- ఆడుకుంటూ వెళ్లి పురుగుల మందు తాగిన బాలుడు
- ఆపరేషన్‌కు రూ.10లక్షల ఖర్చు
- ఆపన్న హస్తం అందించాలని వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు రుద్రేశ్

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ప్రాణపాయ స్థితిలో ఉన్న బాలుడికి దాతలు ఆపన్నహస్తం అందించి ప్రాణభిక్ష పెట్టాలని ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ద్యావ రేవతి–శ్రీకాంత్ రెడ్డి దంపతుల కుమారుడు రుద్రేశ్ (2) వారం క్రితం ఇంట్లో ఆడుకుంటూ పురుగుల మందు డబ్బా తీసుకొని తాగాడు. స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని రెయిన్‌బో పిల్లల ఆస్పత్రికి తరలించారు. చికిత్స కోసం ఇప్పటికే రూ.4లక్షలు ఖర్చు చేశారు. ఆపరేషన్‌కు మరో రూ.10లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ ఆదంపతులు కుమారుడిని కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలుడి ఆపరేషన్‌కోసం దాతలు సాయం అందించాలని, మండల, గ్రామ రెడ్డి సంఘం సభ్యులు సాయం అందించాలని మండల రెడ్డిసంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి కోరుతున్నారు.

గూగుల్ పే నెంబర్ 7569895470 ద్వారా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.